క్లుప్తంగా

రెండు పోలింగ్ కేంద్రాల మార్పు



నూతనంగా ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కల్లూరు: అర్బన్ పరిధిలోని 105, 108 పోలింగ్ కేంద్రాలను కల్లూరు ఎస్టేట్‌లోని శాంతినికేతన్ స్కూల్‌లో ఏర్పాటు చేయనున్నారు. శనివారం జేసీ, పాణ్యం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య.. తహసీల్దార్ టీవీ రమేష్ బాబుతో కలసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. 105, 108 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లందరూ కల్లూరు ఎస్టేట్, చింతలముని నగర్ ప్రాంతాలకు చెందిన వారు ఉండడంతో ఈ కేంద్రాలను మారుస్తున్నట్లు తెలిపారు.

'సుంకేసుల'లో 1.20 టీఎంసీల నిల్వ

గూడూరు: సుంకేసుల జలాశయంలో శనివారం 1.20 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేసీ కాల్వకు 331 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు పేర్కొన్నారు. ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ లలిత సహస్ర నామ పారాయణం



భక్తిశ్రద్ధలతో శ్రీ లలిత సహస్ర నామ పారాయణంలో పాల్గొన్న మాతృమూర్తులు

కల్లూరు: కల్లూరులో వెలసిన అవధూత రామిరెడ్డి తాత సేవా సంస్థానంలో శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో శ్రీ లలిత సహస్ర నామ పారాయణం, చక్ర కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. లలిత కామేశ్వర స్వామి సేవాసమితి, సనాతన ధర్మం గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాతృమూర్తులందరికీ తాత సేవా సంస్థాన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కమిటీ సభ్యులు తాంబూలాలు అందించి సత్కారించారు. ఇంట్లో ప్రతి రోజు లలితా సహస్రనామ పారాయణం చేస్తే మనశ్శాంతి లభిస్తుందని శ్రీ లలిత కామేశ్వర స్వామి సేవ సమితి అధ్యక్షురాలు వరలక్ష్మి భక్తులకు సూచించారు.

నిందితుల అరెస్ట్

సి.బెళగల్: మండలంలోని ముడుమాల గ్రామంలో గతనెల 3న జరిగిన ఘర్షణకు సంబంధించి ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పీరయ్య తెలిపారు. పొలం రస్తా విషయంలో జరిగిన ఘర్షణలో నలుగురు వ్యక్తులపై దాడులు చేసిన కేసులో 8 మందిపై కేసు నమోదయ్యింది. నిందితులైన కోతి రసూల్, వాసు, రామాంజనేయులు, మునేష్, కుమార్, మారందొడ్డి శ్రీను, ఉషన్న, కోతి ఊషన్న గారి రామాంజనేయులు శనివారం మండలంలోని పోలకల్ గ్రామ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద కర్నూలు బస్సు ఎక్కేందుకు వేచి ఉండగా.. సమాచారం మేరకు, సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిని కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏఫ్‌ఏ -2 టాపర్లతో సెల్ఫీ



టాపర్స్ మధు, మోహనకృష్ణలతో హెచ్ఎం మాబున్నీ, టీచర్లు

సి.బెళగల్: మండలంలోని ముడుమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్ - 2 (ఎఫ్ఏ - 2) పరీక్షలలో పాఠశాల టాపర్లుగా నిలిచిన 10వ తరగతి విద్యార్థులతో హెచ్ఎం మాబున్నీ, టీచర్లు అబ్దుల్ గఫర్, మధుమిత సెల్ఫీ తీసుకుని, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పాఠశాలలోని ఏ సెక్షన్‌లో చదువుతున్న మధు 300 మార్కులకు 271, బీ సెక్షన్‌లో మోహనక్రిష్ణ 272 మార్కులతో టాపర్లుగా నిలిచారు.

రేపటి లోగా స్పాట్ బిల్లింగ్ పూర్తి కావాలి

కర్నూలు(రాజ్‌విహార్): స్పాట్ బిల్లింగ్ ప్రక్రియను సోమవారంలోగా పూర్తి చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిల్లింగ్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, బిల్లుల వసూలుపై దృష్టి సారించాలన్నారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 325 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు శనివారం 325 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 16 కేంద్రాల్లో జరుగుతున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 2,956 మంది గానూ 2,631 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.




ముజఫర్ నగర్ వైద్య శిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న ప్రజలు, పరీక్షిస్తున్న డాక్టర్,




మీదివేముల గ్రామంలో లబ్ధిదారులకు అద్దాలు పంపిణీ చేస్తున్న శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పెసరవాయిలో మెడికల్ కిట్ అందజేస్తున్న దృశ్యం

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని ఈ శిబిరాన్ని సందర్శించి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పేద ప్రజలు వైద్యానికి ఇబ్బందులు పడకూడదని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారన్నారు. ఆయా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించారన్నారు. ప్రస్తుతం ఆరోగ్య సురక్ష ద్వారా ఏడు రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి కేంద్రంలో ఇద్దరు పీహెచ్‌సీ డాక్టర్లు, ఇద్దరు స్పెషల్ డాక్టర్లను అందుబాటుల్లో ఉంచామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ (కల్లూరు అర్బన్ క్లస్టర్-2 అధ్యక్షుడు) శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శివ, గోపీనాథ్, సిరాజ్, ఉస్మాన్, ముళ్ల హుస్సేన్, రామాంజనేయులు, వైద్యాధికారులు, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, తడకనపల్లె గ్రామంలో కంటిపరీక్షలు చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

ప్రజల చెంతకే వైద్యం

ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్యసేవలను తీసుకెళ్తుందని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. శనివారం కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు.అక్కడ అందుతున్న సేవలను డీఎంహెచ్ఓ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఈఓఆర్డీ రవి కిషోర్, సర్పంచ్ సాహెరాబీ, నాయకులు కృష్ణరెడ్డి, ఉలిందకొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంపీహెచ్ఈఓ విజయ్‌కుమార్, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: రాష్ట్రంలోని పేదలందరికీ మెరుగైన వైద్యం అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జగనన్న ఆరోగ్య సురక్ష రాష్ట్ర నోడల్ అధికారి టి. రామనాథ్ అన్నారు. శుక్రవారం సచివాలయం-4 పరిధిలో ఆశ్రమ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలంచంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి , సుమంత్‌రెడ్డి, బాబు, సుబ్బరాయుడు, ఎంపీడీఓ దస్తగిరి, డాక్టర్లు సునీతా, మునిస్వామి, సుబ్బారెడ్డి ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు: ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మీదివేముల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డితో పాటు, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, ఎంపీపీ తిప్పన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పలు రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, సచివాలయ కన్వీనర్లు జగన్ మోహన్‌రెడ్డి, రమేశ్‌నాయుడు, లక్ష్మీదేవి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, వైద్యాధికారి డా.నాగరాజు, సచివాలయ సిబ్బంధి, వలంటీర్లు పాల్గొన్నారు.

గడివేముల: ప్రజలు పూర్తి ఆరోగ్యంతో ఉండాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని రాష్ట్ర వైద్య విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ మహమ్మద్ రఫి అన్నారు. మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. అంతకుముందు ఈ శిబిరాన్ని సర్పంచ్ శేఖర్, నంద్యాల వ్యవసాయ కమిటీ చైర్మన్ శిరుప శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ మొల్లా జబీన్ ప్రారంభించారు. అనంతరం మహమ్మద్ రఫి మాట్లాడుతూ ఇది వరకు ఏ ప్రభుత్వం కూడా పైసా ఖర్చులేకుండా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వలేదన్నారు. అనంతరం ఆయన సంపూర్ణ పోషకార స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప,ఈఓఆర్డీ ఖాలీక్,ఎంపీహెచ్ఈఓ మహేశ్వరరెడ్డి, పీహెచ్ఎన్ సర్వేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఊరిలోనే వైద్యం సంతోషకరం



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ద్వారా మా గ్రామంలోనే వైద్య సేవలు ఉచితంగా అందించడం సంతోషంగా ఉంది. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయలేని విధంగా జగన్ ప్రభుత్వం చేస్తుంది. నేను గత కొన్ని రోజుల నుంచి కంటి సమస్యతో బాధపడుతున్నాను. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయడంతో పాటు మందులు అందజేశారు. -కమలమ్మ,పెసరవాయి

సీఎంకు రుణ పడి ఉంటా



కొన్ని రోజుల కిందట నేనున ఆరోగ్యశ్రీ కింద గుండె ఆపరేషన్ చేయించుకున్నాను.నాకు కార్పొరేట్ వైద్యం అందించడంతో పాటు ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు కల్పించారు. ఈ రోజు నాకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో మా గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో గుండెకు మళ్లీ ఈసీజీ చేయించుకున్నాను.గుండె డాక్టర్లు నాకు పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు. మా కోసం ఎంతో చేస్తున్న సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం. - సంఘయ్య,పెసరవాయి

పేదలకు భరోసా.. జగనన్న ఆరోగ్య సురక్ష

- లద్దగిరిలో హెల్త్ క్యాంపును పరిశీలించిన కుడా చైర్మన్ కోట్ల హర్ష

కోడుమూరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని లద్దగిరి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీయడంతో పాటు, ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటిని, కుటుంబాన్ని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. పేద ప్రజలందరికీ కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భవిష్యత్‌లో ప్రజలు జబ్బులతో బాధపడకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి వృద్ధులకు కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడిరూతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, డాక్టర్లు జయంతి, నస్రీన్, మధన్, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, ఎంపీటీసీ ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, నాయకులు బందెనవాజ్, రవికుమార్‌రెడ్డి, గిడ్డమూర్తి, మద్దయ్య, గోవిందు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.



హెల్త్ క్యాంపులో మందులను పరిశీలిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

జగనన్న సురక్ష..ప్రజారోగ్యానికి శ్రీరామ రక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.జె సుధాకర్

కర్నూలు సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి శ్రీరామ రక్షగా నిలిచిందని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ తెలిపారు. కర్నూలు మండల పరిధిలోని బసాపురం గ్రామ పంచాయతీ మజరా తొలిశాపురం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీ తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల వద్దకే పాలన సాగిస్తున్నారని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నారని వివరించారు. గతంలో ఫించన్ కావాలంటే కార్యలయాలు, రాజకీయ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు తప్పేవికావని, అయినా పింఛన్ మంజూరయ్యే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎవరి దగ్గరికీ వెళ్లాల్సిన అవసరం లేదని, సచివాలయంలో సంప్రదిస్తే వెంటనే పింఛన్ మంజూరు అవుతుందని గుర్తు చేశారు. సీఎం జగనన్న వైద్య, విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతనిన్నారన్నారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చారని, అమ్మఒడి, విద్యా, వసతి దీవెన అమలు చేస్తూ విద్యాభివృద్ధికి చేయూతనిస్తున్నారని గుర్తు చేశారు. వ్యవసాయినికి పెట్టుబడి సాయం తోపాటు దిగుబడులు అమ్ముకునేంత వరకు ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మారుమూల పల్లెలకు సైతం వైద్య సేవలు అందజేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహిమ్యా, సి.బెళగల్ జెడ్పీటీసీ గిరిజోన్, సచివాలయ కన్వీనర్లు మధు, రంగన్న, అయ్యస్వామి, ఈఓఆర్డీ అనురాధ, డిప్యూటీ తహసీల్దార్ భాను, జి.శింగవరం నాయకులు రవిరెడ్డి, మద్దిలేటి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదు...

ఇన్నేళ్లుగా ఈ ప్రాంతానికి లీడర్‌నని చెప్పుకునే టీడీపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని, తన మాటకు ఎదురు చెబితే కులాలు, కుటుంబాల మధ్య చిచ్చుపెట్టడం తప్పా అని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ విమర్శించారు. ఎన్నో కుటుంబాల మధ్య చిచ్చుపెట్టి అసరం మేరకు దాడులు చేయించిన ఘటనలు కోకొల్లలని ఆరోపించారు. అలాంటి చర్యలకు పాల్పడే విష్ణువర్ధన్ రెడ్డి తనపై దుష్ప్రచారం చేయించారన్నారు. ఇదే గ్రామంలో ఇనాం, ప్రభుత్వ భూములు ఎవరు అక్రమించుకున్నారో అందరికీ తెలుసునన్నారు. ప్రజల వద్దకే పాలన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఈ గ్రామానికి కనీసం తాను 20 సార్లు వచ్చానని, గతంలో ఏ ఎమ్మెల్యేనైనా వచ్చార అని ప్రశ్నించారు. ప్రజాసేవకులను గుర్తించి మద్దతు ఇవ్వాని, ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

'ఆరోగ్య సురక్ష'పై అలసత్వం వహిస్తే చర్యలు

సి.బెళగల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ల నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) నూకరాజు హెచ్చరించారు. శనివారం సి.బెళగల్ మండలంలోని ముడుమాలలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. శిబిరంలో వైద్యులు, అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండ చూడాలన్నారు. ఈసీజీ పరీక్షలను, కంటీ పరీక్షలతో పాటు ఇతర వైద్య పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. హెల్త్ క్యాంప్‌లో 434 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ హరిచంద్రుడు తెలిపారు. గ్రామ సర్పంచ్ బతుకమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ సీబీ తులసిరెడ్డి, సచివాలయ కనీ్వనర్ మద్దిలేటి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఏ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, డాక్టర్లు సునీత, రంజిత్‌నాయక్, అనిల్, కంటి వ్యాధి నిపుణుడు సంపత్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులు ఉన్నారు.



ముడుమాల హెల్త్ క్యాంప్‌లో వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంఓ నూకరాజు,



చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హరిచంద్రుడు

ఫోర్టిఫైడ్ బియ్యంతో మహిళల్లో రక్తహీనత నివారణ

- టౌన్ మోడల్ స్కూలులో ఫోర్టిఫైడ్ మిల్లెట్లతో తయారు చేసిన వంటకాల ప్రదర్శన
- హాజరైన జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూల(సెంట్రల్) : ఫోర్టిఫైడ్ బియ్యంతో తయారు చేసిన ఆహార పదార్థాలు బలవర్ధకమైనవని, వాటిని ఆహారంగా తీసుకోవడంతో మహిళల్లో రక్తహీనతను నివారించవచ్చని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య చెప్పారు. శనివారం ప్రభుత్వ టౌన్ మోడల్ పాఠశాలలో ఫోర్టిఫైడ్ బియ్యం, మిలెట్లతో తయారు చేసిన వివిధ రకాల వంటకాల స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. దాదాపు 50 రకాల వంటకాలను ఆమె రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....సాధారణ బియ్యాన్ని విటమిన్‌లు, ఖనిజాలు, లవణాలను జోడించి రూపొందించిన బియ్యమే ఫోర్టిఫైడ్ రైస్ అన్నారు. ప్రజా సరఫరాల కింద ప్రభుత్వం బియ్యం, గోధుమపిండి, చెక్కర, దాల్‌తోపాటు కొత్తగా టేక్ హోం రేషన్ కింద రాగులు, అటుకులు, ఖర్జూరతోపాటు 3 కేజీల బియ్యం ఇస్తున్నారన్నారు. టేక్ హోం కిట్లను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలకు అందజేస్తున్నట్లు చెప్పారు. మిలెట్లు, ఫోర్టిఫైడ్ రైస్‌తో తయారు చేసిన ఆహార పదార్థాలను బాలింతలు, గర్భిణులు, రక్తహీనతతో బాధపడే మహిళలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీఎం షర్మిళ, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, , డీఎస్ఓఆచార్యులు పాల్గొన్నారు.



వంటకాలను పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

27న ఓటరు ముసాయిదా జాబితా

కర్నూలు (సెంట్రల్): ఓటరు ముసాయిదా జాబితాను ఈనెల 27వ తేదీన విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పాణ్యం నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కా న్ఫరెన్స్ హాల్‌లో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లోని 6,7,8 ఫారాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఓటరు పరిశీలన చేయకుండానే బీఎల్‌ఓలు ఓటర్లను తొలగించడంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు ఫిర్యాదు చేయగా పూర్తిస్థాయి విచారణ జరపాలని అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ఓర్వకల్లు, కల్లూరు తహసీల్దార్లు రమేష్ బాబు, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్స్య సంపదను మరింత అభివృద్ధి చేస్తాం

- గోరుకల్లు జలాశయంలో చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: నియోజకవర్గంలో మత్స్య సంపదను మరింత అభివృద్ధి చేసి మరి కొంతమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గోరుకల్లు జలాశయంలో 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' కార్యక్రమంలో భాగంగా చేప పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రాయితీపై బోట్లు, డీజిల్, వలలు, చేపలు విక్రయించేందుకు వాహనాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. గోరుకల్లు జలాశయం కోసం భూములిచ్చిన రైతులకు ఆ జలాశయంలో చేపలు పట్టుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. ప్రస్తుతం జలాశయంలో 4లక్షల చేప పిల్లలు వదిలామన్నారు. గోరుకల్లు మత్స్యకార సొసైటీ సంఘానికి తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, మత్స్యశాఖ జేడీ రాఘవరెడ్డి, ఎఫ్‌డీఓ పామన్న, ఎంపీటీసీ సభ్యులు గణేష్, సర్పంచ్ చిన్న వస్నూర్‌సా, గడివేముల జెడ్పీటీసీ సభ్యులు ఆర్.బి. చంద్రశేఖర్‌రెడ్డి, గోరుకల్లు మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ చెంచులన్న, లక్ష్మీమద్దయ్య, సుబ్బరాయుడు, మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, మండల సచివాలయ కనీ్వనర్ గుద్దెటి సుమంత్‌రెడ్డి, బాబు, రామలక్ష్మయ్య, శంకర్‌రెడ్డి ,రాజన్న పాల్గొన్నారు.



గోరుకల్లు జలాశయంలో చేపలు వదులుతున్న ఎమ్మెల్యే

ప్రైవేట్ వెంచర్లకు దీటుగా జగనన్న కాలనీలు

ఓర్వకల్లు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన జగనన్న హౌసింగ్ కాలనీలు ప్రైవేట్ వెంచర్లకు దీటుగా నిలిచాయని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రం ఓర్వకల్లు హౌసింగ్ కాలనీని కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడుతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లులేని నిరుపేదలు ఉండకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీలను నిర్మిస్తున్నారన్నారు. మండలంలో మొత్తం 2,800 ఇళ్లు మంజూరుకాగా, ఇప్పటికి 2,659 ఇళ్లు నిర్మించినట్లు తెలిపారు. ఇందులో ప్రధానంగా ఓర్వకల్లు హౌసింగ్ లే అవుట్ జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, హౌసింగ్ ఏఈ రామయ్య, ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.